నమస్తే తెలంగాణ
# సూర్యాపేట
5 | నల్లగొండ, బుధవారం 17 జూలై 2024 | SURYAPET


నల్లగొండ కలెక్టర్ నారాయణరెడ్డి


సూర్యాపేట కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

## సీఎం మీటింగ్‌కు కలెక్టర్లు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళ వారం హైదరాబాద్‌లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో సమావేశం నిర్వహించారు. నల్లగొండ, సూర్యాపేట కలెక్టర్లు సి.నారాయణరెడ్డి, తేజస్ నందలాల్ పవార్ మీటింగ్‌లో పాల్గొన్న దృశ్యమిది.

–రామగిరి, జూలై 16

# వానల్లేవ్.. చెరువుల్లో నీళ్లు లేవ్

## ఉమ్మడి జిల్లాలో వర్షాభావ పరిస్థితులు

ఉమ్మడి జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. వర్షాకాలంలోనూ సాగు నీటి కష్టాలు తప్పడం లేదు. వానలు లేక కరువుఛాయలు కనిపిస్తున్నాయి. చెరువుల్లో నీళ్లు లేక బీడువారిపోయాయి. అసలు ఈ ఏడాది చెరువుల్లోకి నీరే చేర లేదు. ఇంకో వైపు వాగులు, వంకలు వట్టిపోయాయి. వర్షాలు, నీరు లేక వ్యవసాయ పనులు కూడా ముందుకు సాగడం లేదు. దాంతో రైతుల సాగుపై ఆశలు సన్నగిల్లుతున్నాయి.

– నల్లగొండ, జూలై 16

- చాలా చోట్ల ఎండిన చెరువులు, కుంటలు.. అడుగంటిన భూగర్భ జలాలు
- చెక్‌డ్యామ్‌లు, వాగులు, వంకల్లో కనిపించని నీటి జాడ
- పలు మండలాల్లో లోటు వర్షపాతం నమోదు
- ముందుకు సాగని వ్యవసాయ పనులు
- ప్రస్తుతం నాగార్జున సాగర్‌లో 503 అడుగుల్లోనే నీరు
- ఆందోళనలో అన్నదాత.. పరిస్థితి అగమ్యగోచరం


పూర్తిగా ఎండిన కనగల్ మండలంలోని మైల చెరువు

**11.40 లక్షలకు 3.75 లక్షల ఎకరాల్లోనే సాగు**

నల్లగొండ జిల్లాలో ఈ వానకాలం సీజన్‌లో 11.40 లక్షల ఎకరాల్లో ఆయా పంటలు సాగు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 3.75 లక్షల ఎకరాల్లోనే సాగు అయ్యాయి. అందులో పత్తి 3.46 లక్షల ఎకరాలు, వరి 15వేల ఎకరాల్లోనే సాగు అయ్యింది. వర్షపాతం ఈ నెలలో 16.89 సెంటీమీటర్లు పడాల్సి ఉండగా ఇప్పటి వరకు 3.46 సెంటీమీటర్లు మాత్రమే పడింది. జూన్ కంటే ఎక్కువ వర్షం పడినప్పటికీ అప్పటికి రైతులు ఎలాంటి సాగు ఆలోచన చేయకపోవడంతో పంటల సాగు గణనీయంగా తగ్గింది. కనీస వర్షపాతం నేపథ్యంలో గత యాసంగిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం కూడా పట్టించుకోదనే ఆలోచనతో పంటల సాగులో రైతులు ముందుకు రాకపోవటం గమనార్హం.

### పత్తి రైతుల పరిస్థితి అగమ్య గోచరం

జిల్లాలో వానకాలం సీజన్‌లో ఎక్కువగా పత్తి సాగు చేస్తారు. ప్రతి ఏటా ఈ సీజన్‌లో ఆరు నుంచి ఏడు లక్షల ఎకరాల్లో పత్తి సాగు అవుతుండగా ఈ సారి లోటు వర్షపాతం కారణంగా ఇప్పటి వరకు 3.46 లక్షల ఎకరాల్లోనే సాగు అయ్యింది. వర్షాలు లేక విత్తిన విత్తనాలు మొలకెత్తకపోవడంతో ఒకటికి రెండు సార్లు విత్తనాలు తీసుకొచ్చి విత్తాల్సిన పరిస్థితి ఏర్పడింది. విత్తనం మొలకెత్తకపోవటంతో కొందరు రైతులు ఆ పంటను వదిలేయగా.. కొంచెం కొంచెం వచ్చిన మొలకలు బతుకుతాయా చస్తాయా అనే డైలామాలో పడ్డారు. ఇప్పటి వరకు విత్తిన విత్తనాలు మొలకెత్తకపోవటంతో మిగిలిన రైతులు ఆ పంట జోలికే పోకుండా ఉన్నారు. ఇక వరి సాగు చేద్దామని నారు మళ్లు సిద్ధం చేసుకున్న రైతులు నాట్లు వేద్దామంటే సమృద్ధి వర్షాలు పడక పోవటంతో ముందుకు రాని పరిస్థితి.

### వర్షపాతం లెక్కల్లో గందర గోళం

ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 146.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 195.2 మిల్లీమీటర్ల వర్షం పడి 33శాతం అదనపు వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ లెక్కలు చెబుతున్నాయి. 33శాతం అదనపు వర్షపాతం నమోదైతే 11.40 లక్షల ఎకరాలకు గానూ ఇప్పటి వరకు 3.75 లక్షల ఎకరాల పంటలు మాత్రమే ఎందుకు సాగయ్యాయి? సమృద్ధిగా వర్షాలు పడితే జిల్లాలో ఉన్న 1927 చెరువుల్లో నీరెందుకు లేదు? సగటు గ్రౌండ్ వాటర్ ఇంకా 10 మీటర్ల కిందనే ఎందుకు ఉన్నది? అనే ప్రశ్నలకు వాతావరణ శాఖ అధికారులే సమాధానం చెప్పాలి. ఏదో ఒక గ్రామంలో పడ్డ వర్షాన్ని పరిగణలోకి తీసుకొని మండల యూనిట్‌గా.. ఒక మండలంలో పడ్డ వర్షాన్ని జిల్లా యూనిట్‌గా తీసుకొని వాతావరణ శాఖ యంత్రాంగం లెక్కలు వేసి అధిక వర్షపాతం పడిందని ప్రభుత్వానికి నివేదించి తప్పుదోవ పట్టిస్తుందనేది తోసి పుచ్చలేని అంశం.


ఎండిన నల్లగొండ మండలంలోని ముషంపల్లి చెరువు

### అడుగంటుతున్న చెరువులు

ఉమ్మడి జిల్లాలో చెరువులు దాదాపు అని ఎండిపోయే దశకు వచ్చాయి. అనేక చోట్ల చుక్క నీరు కూడా లేదు. మొత్తంగా పరిశీలిస్తే సగటున చెరువుల్లో 25శాతం నీళ్లు కూడా లేవు. ఈ సీజన్‌లో అసలు చెరువుల్లోకి నీళ్లు చేరేంత వర్షాలు పడలేదు. ఇప్పుడున్న నీళ్లు కూడా గతేడాది నింపినవే కావడం గమనార్హం.

### బోర్లు, బావులే దిక్కు..

వర్షాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల ఇప్పటికే ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసి, భూములను సిద్ధం చేసుకొని వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. మరికొన్ని చోట్ల విత్తనాలు వేసిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కొన్ని చోట్ల వరి పోసినా చేతికి రాకుండా పోవడంతో అన్నదాత ఆందోళన చెందుతున్నాడు. పత్తి పంట వేసినా నీళ్లు లేక ఎండిపోతున్నాయి. ఇప్పుడున్న పరిస్థితుల్లో బోర్లు, బావులే ఆధారం కానున్నాయి. గత యాసంగి సీజన్‌లోనే అనేక చోట్ల సాగునీరు లేకపోవడంతో ట్యాంకర్లతో పోసిన ఘటనలు తెలిసిందే.

### ఈ నెల వరకు పంటల సాగుకు అనుకూలం

జిల్లాలో ఇప్పటి వరకు ఈ వానకాలం సీజన్‌లో 3.75 లక్షల ఎకరాల్లో ఆయా పంటలు సాగు అయ్యాయి. పత్తి 3.46 లక్షల ఎకరాలు, వరి 15వేల ఎకరాల్లో సాగు అయ్యింది. ఇంకా రెండు లక్షల ఎకరాలకు వరి నారు రైతులు సిద్ధం చేసుకున్నారు. వర్షాలు ఆలస్యమైనా ఈ నెల వరకు పంటల సాగుకు వాతావరణం అనుకూలంగా ఉంటుంది.

**-పాల్వాయి శ్రవణ్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి, నల్లగొండ**

### ఇంకా నారే పోయలేదు..



మఠంపల్లి తీగల చెరువు గత పదేండ్లుగా ఎప్పుడూ ఎండిపోలేదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువులో పూడిక తీయించి మరమ్మతులు చేయించింది. చెరువు కింద పుష్కలంగా పంటలు పండాయి. కానీ ఇప్పుడు నీళ్లు లేక బీడువారింది. వానకాలం సీజన్ మొదలైనా వర్షాలు లేక చెరువులోకి నీళ్లు రాలేదు. ఇప్పుడు నాట్లు వేసే సమయం కానీ ఇంత వరకూ నారే పోయలేదు. సమైక్య రాష్ట్రంలోనే పరిస్థితి ఇప్పుడు కనిపిస్తున్నది.

**-మన్నెం నర్సారెడ్డి, రైతు, మఠంపల్లి**


మఠంపల్లిలో ఏకాదశి వేడుకలకు ముస్తాబైన లక్ష్మీనరసింహ స్వామి ఆలయం

## నేడు తొలి ఏకాదశి.. మొహర్రం

రామగిరి, జూలై 16 : హిందూ, ముస్లింలకు పండుగ సంబురం కలిసి వచ్చింది. బుధవారం తొలి ఏకాదశి, మొహర్రం సందర్భంగా వేడుకలను నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. తొలి ఏకాదశిని పురస్కరించుకొని భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రముఖ దేవస్థానాలు విద్యుద్దీపాలతో ముస్తాబయ్యాయి. నదీ జలాల్లో పుణ్యస్నానాలు చేసి మొక్కులు తీర్చుకోనున్నారు. ఇక మొహర్రం నేపథ్యంలో ముస్లింలు భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు చేయనున్నారు. ఇప్పటికే పీర్ల సందడి గ్రామాలు, పట్టణాల్లో కోలాహలంగా సాగుతున్నది.


చిట్యాలలో పీర్ల ఊరేగింపు

## మిర్యాలగూడలో పలు రైళ్ల స్టాప్ ఎత్తివేత

**విశాఖ, చెన్నై, నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌లకు ఏడాది మాత్రమే అనుమతి ఇచ్చిన రైల్వే శాఖ**


మిర్యాలగూడలో ఆగిన రైలు

మిర్యాలగూడ, జూలై 16 : సికింద్రాబాద్– గుంటూరు మార్గంలో ప్రయాణించే విశాఖ, చెన్నై, గుంటూరు మార్గంలో ప్రయాణించే విశాఖ, చెన్నై, నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ రైళ్లను మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల రైల్వే స్టేషన్లలో ఈ నెల 19 నుంచి స్టాప్‌ను మళ్లీ ఎత్తివేస్తున్నట్లు రైల్వే శాఖ ఉన్నతాధికారులు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. కరోనా సమయంలో ఈ రైళ్లకు స్టాప్‌లు ఎత్తివేయడంతో రెండేండ్ల పాటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దాంతో మాజీ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు మిర్యాలగూడలో రైళ్లు నిలపాలంటూ రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో గతేడాది జూలై నుంచి ఆయా రైళ్లను మిర్యాలగూడతోపాటు నడికుడి, పిడుగురాళ్ల స్టేషన్లలో ఒక నిమిషం పాటు ఆగేలా అనుమతించారు. ఆదేశాలు ఇచ్చిన సమయంలోనే ఏడాదిపాటు రైళ్లు నిలుపుతామని ఉత్తర్వులు ఇవ్వడంతో ప్రస్తుతం ఏడాది సమయం పూర్తికావడంతో ఈ నెల 19 నుంచి ఆయా స్టాప్‌లను రైల్వే అధికారులు ఎత్తివేశారు. ఉమ్మడి జిల్లాలోని వేలాది మంది ప్రయాణికులు సికింద్రాబాద్–గుంటూరు మార్గంలో ఆంధ్రప్రదేశ్, ఒడిషా వంటి ప్రాంతాలకు వెళ్తుంటారు. రైల్వే అధికారుల నిర్ణయంతో తాము తీవ్ర ఇబ్బందులు పడతామని, మిర్యాలగూడలో రైళ్లను నిలిపేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

## రేపటి నుంచి డీఎస్సీ

- నల్లగొండ ఎస్పీఆర్ పాఠశాలలో ఆన్‌లైన్ పరీక్ష కేంద్రం
- ప్రతి సెషన్‌లో 185 మంది అభ్యర్థులు

రామగిరి, జూలై 16 : రాష్ట్ర వ్యాప్తంగా డీఎస్సీ పరీక్షలు ఈ నెల 18 నుంచి ఆగస్టు 5 వరకు జరుగనున్నాయి. తొలి పర్యాయం ఆన్‌లైన్‌లో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎస్పీఆర్ పాఠశాల ఆవరణలోని ఆన్‌లైన్ పరీక్ష కేంద్రంలో ఎగ్జామ్ ఉంటుందని డీఈఓ భిక్షపతి వెల్లడించారు. ఈ పరీక్షలు ఉదయం 9 నుంచి 11.30 వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల రెండు సెషన్లలో పరీక్షలు జరుగనున్నాయి.

**ఇవి తప్పనిసరి**

- టీజీ డీఎస్సీ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసిన హాల్ టికెట్లు తీసుకురావాలి.
- ఆధార్ కార్డు, పాన్ కార్డు లేదా ఇతర ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డులు వెంట తెచ్చుకోవాలి.
- అభ్యర్థుల వెంట ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష హాల్లోకి అనుమతించరు.
- హాల్ టికెట్‌పై అభ్యర్థి ఫొటో ప్రింట్ కానట్లయితే పాస్‌పోర్ట్ సైజ్ కలర్ ఫొటోలు వెంట తెచ్చుకోవాలి.

## నెమ్మికల్ కళాశాలలో రూ.3లక్షలు గోల్‌మాల్?

- ఏడేండ్ల తర్వాత వెలుగులోకి అక్రమాలు
- విచారణ చేపట్టిన అధికారులు



నెమ్మికల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల

ఆత్మకూర్.ఎస్, జూలై 16 : మండల పరిధిలోని నెమ్మికల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల ట్యూషన్ ఫీజు, కళాశాల అభివృద్ధి కోసం ప్రభుత్వం అందజేసిన నిధులను విద్యార్థులు, కళాశాలకు ఖర్చు చేయకుండా గోల్‌మాల్ చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఉన్నతాధికారులు విచారణ చేపట్టినా తప్పును ఒప్పుకోవడంలో కిందిస్థాయి అధికారులు గుట్టు విప్పడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. 2016–17లో నెమ్మికల్ కళాశాలకు మౌలిక వసతుల కోసం వివిధ రూపాల్లో సుమారు రూ.4లక్షలు వచ్చినట్లు తెలిసింది. వాటిని ఖర్చు చేయకుండా నెమ్మికల్ ఏపీజీవీబీ బ్యాంకులో నుంచి ఎస్‌బీఐ బ్యాంకుకు బదలాయించి కళాశాలకు సంబంధించిన వ్యక్తి పేరున ఆ నిధుల్లో రూ. 3లక్షలు చెక్కు ద్వారా డ్రా చేసినట్లు సమాచారం. డబ్బులు డ్రా చేసిన వ్యక్తి మూడు నెలలకే దొడ్డి దారిన ఫ్యాకల్టీ లెక్చరర్‌గా కళాశాలలో విధులు నిర్వహిస్తున్నాడని తెలిసింది. ఈ నిధుల దుర్వినియోగంపై ఉన్నతాధికారులకు కొందరు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు. కానీ ఏ ఒక్క అధికారి కూడా ఈ విషయం చెప్పడం లేదని విమర్శలొచ్చాయి. ఈ విషయమై జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కృష్ణయ్యను వివరణ అడుగగా నిధుల దుర్వినియోగంపై వచ్చిన ఫిర్యాదుపై విచారణ చేస్తున్నామని, మరో వారం రోజుల్లో కారకులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## జీఎస్టీ తనిఖీలతో షాపులు బంద్


జీఎస్టీ అధికారుల తనిఖీల నేపథ్యంలో తిరుమలగిరిలో మూసి వేసిన దుకాణాలు

తిరుమలగిరి, జూలై 16 : మండల కేంద్రంలో జీఎస్టీ చెల్లింపులు పరిశీలించడానికి జీఎస్టీ అధికారులు వస్తున్నారన్న సమాచారంతో మంగళవారం పలు వ్యాపార దుకాణాలను మూసి వేశారు. సాయంత్రం అధికారులు వెళ్లిన తర్వాత తిరిగి షాపులను నిర్వహించారు. ప్రజల నుంచి జీఎస్టీ వసూలు చేస్తున్న వ్యాపారులు ఇప్పుడు తప్పించుకోవడంపై జనం సందేహం వ్యక్తం చేస్తున్నారు.

# డ్రగ్స్ నియంత్రణకు అడుగులు

- విద్యార్థులకు డ్రగ్స్ చేరకుండా చర్యలు
- హైస్కూళ్లలో ప్రహరీ క్లబ్‌లను ఏర్పాటు చేయనున్న విద్యాశాఖ
- ప్రతి తరగతి నుంచి ఇద్దరు విద్యార్థులకు అవకాశం
- విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులతో కమిటీ



సూర్యాపేట అర్బన్, జూలై 16 : రాష్ట్రంలో డ్రగ్స్ సరఫరాను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. పాఠశాలల్లో విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా కట్టుదిట్టమైన చర్యలకు ఉపక్రమించింది. ఇందుకోసం ప్రభుత్వ, ప్రైవేట్ హైస్కూల్స్‌లో ప్రహరీ క్లబ్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి అన్ని జిల్లాల విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు చేశారు. మాదక ద్రవ్యాల దుర్వినియోగం నుంచి పిల్లలను ప్రహరీ క్లబ్‌లు కాపాడనున్నాయి. ప్రతి కమిటీలో ఆరుగురు సభ్యులను వివిధ స్థాయిలో ఉన్న వారిని నియమించనున్నారు. సూర్యాపేట జిల్లాలో ఏడు వందలకుపైగా హైస్కూళ్లు ఉన్నాయి.

### ప్రహరీ క్లబ్ సభ్యులు

పాఠశాలల్లో ప్రహరీ క్లబ్ అధ్యక్షులుగా హెడ్ మాస్టర్ లేదా ప్రిన్సిపాల్‌ను ఎన్నుకుంటారు. వైస్ ప్రెసిడెంట్‌గా సీనియర్ టీచర్ లేదా ఫ్రెండ్లీ టీచర్‌ను నియమిస్తారు. 6 నుంచి 10వ తరగతి వరకు ప్రతి తరగతిలోని ఇద్దరు విద్యార్థులు, స్థానికంగా ఉంటే పోలీస్ స్టేషన్ నుంచి ఒక అధికారి, పేరెంట్స్ నుంచి ఒకరు ప్రహరీ క్లబ్‌లో సభ్యులుగా ఉంటారు.

### త్వరలో మార్గదర్శకాలు

ప్రభుత్వం డ్రగ్స్ నియంత్రణ కోసం ఏర్పాటు చేస్తున్న ప్రహరీ క్లబ్‌లకు సంబంధించిన పూర్తి మార్గదర్శకాలను ప్రభుత్వం త్వరలో విడుదల చేయనున్నది. ఇప్పటికే ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో కమిటీల ఏర్పాటు పూర్తయ్యేలోపు ప్రభుత్వం సూచించే మార్గదర్శకాలను అమలు చేసేందుకు సిద్ధం కానున్నారు.

### కమిటీల లక్ష్యం

పిల్లలు మత్తు పదార్థాలుగా ఉపయోగించే ఔషధ మందులు, పదార్థాలు, ఇతర రకాల వస్తువులు చేరకుండా నిరోధించడానికి ఈ ప్రహరీ క్లబ్‌లు పనచేయనున్నాయి. ఇప్పటికే డ్రగ్స్ మాఫియాపై ఉక్కుపాదంతో అణగదొక్కుతున్న ప్రభుత్వం పాఠశాలల్లో ఏర్పాటు చేసే ప్రహరీ క్లబ్‌ల సహకారంతో పోలీస్ అధికారులు మరిన్ని దాడులు నిర్వహించనున్నాయి. రానున్న రోజుల్లో డ్రగ్స్, మాదకద్రవ్యాల జిల్లాగా మార్చేందుకు సహకారం అందించనున్నాయి.

### కమిటీల కోసం ఆదేశాలు వచ్చాయి



కమిటీలకు సంబంధించి విద్యాశాఖ కార్యాలయానికి ఆదేశాలు వచ్చాయి. జిల్లాలోని అన్ని మండలాధికారులకు సమాచారం అందించాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు కమిటీలను ఏర్పాటు చేసి అమలు చేస్తాం. స్థానికంగా ఉన్న పోలీసు అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి కమిటీల్లో వారి సూచనలు తీసుకుంటాం.

**-అశోక్, జిల్లా విద్యాశాఖ అధికారి, సూర్యాపేట**

### డ్రగ్స్ రహిత జిల్లాగా మారాలి



పాఠశాల, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన లేక డ్రగ్స్ బారిన పడి వాటికి బానిసలవుతున్నారు. డ్రగ్స్ నియంత్రణకు కమిటీలను ఏర్పాటు చేసి పకడ్బందీగా అమలు చేయాలి. ఇందులో తల్లిదండ్రులను భాగస్వాములను చేసి వారి సలహాలు, సూచనలు తీసుకోవడం మంచి పరిణామం. ఈ కమిటీల ద్వారా డ్రగ్స్ రహిత జిల్లాగా మారేందుకు అవకాశం ఉంటుంది.

**-కె. ధనుంజయ చారి, పేరెంట్, సూర్యాపేట**